


# అమ్మ

యస్. వివేకానంద

"నా గ్లాసులోకూడా వొంపు .. నాకూ తాగాలనుందీ రోజు" నౌషాద్ వేపు చూస్తూ అన్నాడు శాస్త్రి.

నౌషాద్ ముఖంలో ఆశ్చర్యం పురి విప్పింది.

శాస్త్రి మంచివాడు. మిలటరీలో వుద్యోగం చేస్తున్నప్పటికీ మందు కొట్టకుండా మడికట్టుకున్న విచిత్రమైన వ్యక్తి

"తాగాలనుకునే వాడివి ఇడియపడ్తావేం? నిజంగా తాగాలనుంటే చెప్పెయ్...నిండు సీసా తెస్తాను 'మళ్ళీ కొంచెం గ్లాసులోకి వొంపుకుంటూ శాస్త్రి కళ్ళల్లోకి చూశాడు నౌషాద్.

"నాకూ చేతనవు తాగటం ...'

నవ్వేడు నౌషాద్.

"ఎందుకు నవ్వుతావ్?–"

నవ్వు ఆపుకున్నాడు. గ్లాసులో మిగిలివున్న 'రమ్' గొంతులో పోసుకుని పూర్తిగా కాలిపోబోతున్న సిగరెట్ పెదాల మధ్య ఇరికించి ఆఖరి వరకు దమ్ము పీల్చి దూరంగా గిరవాటేశాడు.

"అదిగాదు దోస్త్. అలవాటున్నవాడివైతే .. నన్నడగకుండానే గ్లాసులోకి వొంపుకుని వూదేసేవాడివి..." మళ్ళీ నవ్వేడు.

శాస్త్రికి ఆ మాటలు వినేసరికి చిన్నతనమనిపించింది. కూర్చున్న వాడల్లా లేచివెళ్ళి నిండు రమ్ సీసా తెచ్చుకుని కార్క్' నోటితో వూడతీసి ఆగ్రహంతో గ్లాసునిండా నింపుకుని గటగటా తాగేశాడు

విస్వెరపోయేడు నౌషాద్.

నోరంతా తిమ్మిరెక్కి నాలుక మొద్దుబారినట్లయింది గుండె మంటగా పుష్పవచ్చిస్తోంది— మత్తులో మునిగిపోతున్న శాస్త్రి అరమోడ్పు కళ్ళు నౌషాద్ ముఖంలోకి తేరిపార చూశాయి.

"మరోగ్లాసు పట్టిస్తావా?—" అడిగేడు నౌషాద్.

నౌషాద్ మాటలు తనను అవహేళన చేస్తున్నట్టు ఫీలయ్యాడు శాస్త్రి.

సీసాలో మందు చివరిబొట్టు వరకూ స్వాహా చేసిన శాస్త్రికి మతిస్థిరం తప్పుతోంది.

'నీలో కొత్త మార్పొస్తోంది శాస్త్రీ . ఈ రోజు నువ్వెందుకు తాగేవో చెప్పాలవా..

సిగరెట్ వెలిగించిన శాస్త్రి 'పిచ్చి ప్రశ్న .... మరి..రోజూ నువ్వెందుకు తాగుతావ్?..."అంటూ యెదురు ప్రశ్న వేశాడు.

'హు ...హుం .. మోజుతగ్గే జీవితాన్ని మర్చిపోవటంకోసం..." శూన్యంలోకి చూస్తూ అన్నాడు నౌషాద్

'నా కిప్పుడెంతో హాయిగావుంది దోస్త్. ఈ సాయంత్రమే నేను వెళ్ళిపోతున్నాను. అందుకే తాగేను..."

సంతోషంభాయ్. మళ్ళీ యెప్పుడొస్తావ్?–"

'ఇకరాను. మిలటరీ జీవితానికి శాశ్వతంగా గుడ్‌బై. మళ్ళీ నిన్ను కలువలేనేమో ... మనం విడిపోయేముందు ... ఇద్దరిమధ్యా మర్చిపోలేనంతగా విర్చిపోగల గుర్తుకోసమే తాగేను... యు బి లీవ్ మి! "

"పికేం భాయ్. ఆనందంతో నువ్వింటికెళ్ళిపోతున్నావ్. అమ్మచేతి భోజనం తిన్నతర్వాత మళ్ళీ ఇక్కడకు రావాలనిపించదు. కదూ?"

మత్తులో శాస్త్రి వూగిపోతున్నప్పటికీ అమ్మ గుర్తొచ్చేసరికి నిషా దిగిపోయినట్టయింది. కంటిలో నీరు చిప్పింది. ఇంకా ఏవో భావాలు ముఖంపైన ముద్రపడ్డాయి.

"అవును నౌషాద్"అనేసి నిర్లిప్తంగా నవ్వేడు.

'తల్లి అంటే నీకెంత గౌరవమో నీ మాటల్లోనే తెలుస్తోంది శాస్త్రీ ..." ఇంకా ఏదో చెప్పబోయాడు.

"అమ్మకు సీరియస్‌గా వుందని నాన్న టెలిగ్రామిచ్చాడు. వెడుతున్నాను. అమ్మను బ్రతికించుకునేందుకు వెడుతున్నాను..."కళ్ళు తుడుచుకున్నాడు

"సచ్ భాయ్ తల్లిని చూడాలని నీకెంత తొందరగా వుందో.. ఆఖరి ఘడియల్లో కొడుకు తన దగ్గరే వుండాలని ప్రతి తల్లీ కోరుకుంటుంది. అదే మాతృ హృదయం.

నౌషాద్ సానుభూతికి నవ్వేడు శాస్త్రి.

కానీ—

ఆశ నిరాశలు శాస్త్రి నవ్వును అదుపులో పెట్టేయి

* * *

శాస్త్రికి ఊహ తెల్సినప్పటినుండీ తాతయ్య దగ్గరే పెరిగేడు.

ఎదురింటి గోపి రోజూ తనతో ఆడుకొనేందుకు వచ్చేవాడు. చీకటిపడగానే 'అమ్మ' దగ్గరకెళ్ళాలంటూ వెళ్ళేవాడు.

గోపి ఆటల్లోనూ, మాటల్లోనూ వాళ్ళమ్మ అతనికి బిస్కట్లు పెట్టడం, కథలు చెప్పటం, సినిమాకు తీసుకెళ్ళటంలాంటి కబుర్లు ఏవేవో పదే పదే తన చెవిన పడినప్పుడల్లా .. తన ఇంట్లో యెవ్వరినీ అమ్మా ని పిలవటంలేదేం? ఇంట్లో తనకు అమ్మలేదా? అసలు తనకు అమ్మంటూనే లేదా? అనే ఆలోచనల్లు శాస్త్రి పసి మనసులో కందిరీగల్లా ముసిరేవి

ఒకరోజు అమ్మను గురించి తాతయ్యనడిగేడు.

అప్పుడప్పుడువచ్చి తనను చూసివెళ్ళే తండ్రినీ అడిగేడు.

తాతయ్య, నాన్న, తనకు అమ్మ ఉందనే చెప్పేరు. తనకూ ఓ అమ్మ వుందనే విషయం తెలీగానే .. జామకాయ తిన్నట్టూ, కొత్తచొక్కా తొడుక్కున్నట్టు అన్పించింది శాస్త్రికి.

శాస్త్రి చిన్ని మనసులో అమ్మను చూడాలనే కోరిక పెద్దదవసాగింది.

ఉండీ కన్పించని అమ్మను చూడాలనీ అమ్మ దగ్గర కెళ్ళాలనే వుబలాటం శాస్త్రి పసి మనసులో కలియంగా ఆరాటపడసాగింది.

అమ్మతో కథలు చెప్పించుకోవాలి! అమ్మ చేత్తో అన్నంముద్దలు తినాలి! అమ్మతో కలసి సినిమాకెళ్ళాలి అమ్మదగ్గర పడుకుని నిద్రపోవాలి. పదేళ్ళ శాస్త్రిలో ఆలోచనల్లెన్నో పరుగుపెట్ట నారంభించాయి.

అమ్మ తనకెందుకు అవుపించదు? అమ్మ యెట్లా వుంటుందసలు??...

తనకో చెల్లాయి, తమ్ముడుకూడా వున్నారని తండ్రి అప్పుడప్పుడు మాటల్లో చెప్పేడు.

వాళ్ళిద్దరూ అమ్మదగ్గరే వుంటుంటే తను తాతయ్య దగ్గర దూరంగా యెందుకుండాలనిపించింది.

గారాబంగా పెరుగుతున్న శాస్త్రిలో అమ్మను చూడాలనే పట్టుదల యెక్కువైంది

అమ్మదగ్గర కెళ్లాలనీ, అమ్మను చూడాలనీ... తాతయ్యకు చెప్పకుండా రైలెక్కేడు శాస్త్రి.

వాకిట్లోనే తండ్రి యెదురై యెత్తుకుని ముద్దు పెట్టుకున్నాడు— తనకేసి విచిత్రంగా చూస్తున్న చెల్లాయికీ తమ్ముడికీ 'మీ అన్నయ్య' అని చెప్పేడు.

తండ్రి చేతుల్లోంచి తప్పించుకున్న శాస్త్రి చెల్లాయి తమ్ముడి బుజాలమీద చేతులేసి వాళ్ళతో బాటుతనూ ఇంట్లోకి నడిచాడు.

ఇంటి నాలుగు మూలలూ తల్లికోసం వెతుకుతున్న శాస్త్రిని ఏమిటన్నయ్యా వెతుకుతున్నావ్?' చెల్లి అడిగింది.

"అమ్మేదీ?" ఆశగా అడిగేడు.

"మేడ మీదుంది. పోదాం రా" అనేసి చెయ్యి పట్టుకుని గబగబా మేడ మీదికి తీసుకెళ్లింది.

అమ్మా! అన్నయ్యొచ్చాడే అంది తల్లితో.

తనివితీరా తల్లిని ఆపాదమస్తకం చూశాడు శాస్త్రి

ఏమిటో తెలియని, అర్థం కాని మమత శాస్త్రి కళ్లల్లో ముఖంలో చిందులు తొక్కింది

శాస్త్రి ముఖంలోకి యెక్కువ సేపు చూడలేక దృష్టి మరల్చి ముఖం చిట్లించుకుంది తల్లి.

"అమ్మా ..." అంటూ దగ్గర కెళ్లేడు.

విసవిసా నడుచుకుంటూ గదిలోంచి కిందికి వెళ్లిపోయింది తల్లి.

మళ్ళీపిల్చేడు!. మళ్ళీపిల్చేడు!!.

తల్లినే వెంబడిస్తూ మేడ మెట్లుదిగి తనూ క్రింది హాల్లోకొచ్చాడు.

కొత్త కావటంవల్ల తల్లి తనతో మాట్లాడటం లేదేమో అన్పించింది.

ఇంట్లోవున్న నాలుగు రోజుల్లో తల్లి తనతో ఏ ఒక్కరోజూ మాట్లాడలేదు అన్నం కలిపి పెట్టలేదు సినిమాకు తీసుకెళ్ళలేదు, తను మాట్లాడించినా సమాధానం చెప్పలేదు.

పదేళ్ళశాస్త్రి పసిడిమాటలు, అమాయకమైన కళ్ళు, పాలబుగ్గలు తల్లిని ఆకర్షించలేకపోగా ఆమెలో చికాకును రేకెత్తించాయి —అమ్మకు తనంటే యెందుకిష్టంలేదోనని వంటరిగా కూర్చుని ఏడ్చేసు . ...

* * *

ఆ రోజే......

'ఏమండీ!. వాడిని ఇక్కడినుంచి వెంటనే పంపించేయండి .." శాంతమ్మ భర్తతో అంది.

'ఎందుకనీకీ పట్టుదల?...' భార్య మనసు మార్చే ప్రయత్నంలో అన్నాడు రాఘవరావు.

"వాడు... నా కళ్ళముందు వుండేందుకు వీల్లేదు." మూర్ఖంగా అంది.

'కొండంత ఆశతో అమ్మను చూచేందుకని వాడొచ్చాడు. నీ మూర్ఖపు ప్రవర్తన ఆ పసివాడి యెదుగుతున్న మనసు మీద యెంత దెబ్బతీస్తుందో నువ్వూహించలేవు శాంతా .."

'మీ రెన్నైనా చెప్పండి. ఈ ఇంట్లో అన్నీ ఈ మాత్రంగానైనా వుండాలీ అంటే ... వెంటనే నా కళ్ళముందునుంచి పంపేయండి " మనసులో మాట నిష్కర్షగా చెప్పేసింది

మనసులో కెలికిన బాధకొద్దీ క్షణికంగా అన్నదే గానీ !.. బిడ్డను తను దగ్గరకు తీసుకోలేకపోతున్నందుకు యమయాతన అనుభవిస్తోంది మానసికంగా

చెప్పకుండా ఇల్లువదిలి వచ్చిన శాస్త్రికోసం నాలుగో రోజున తాతయ్య వచ్చాడు. తనతో వెంటతీసుకెడతా నన్నాడు మళ్ళీ

'అమ్మా ... వెళ్తా..." వచ్చేసి చెప్పిన శాస్త్రి మాటలకు ఎలాంటి సమాధానమూ తల్లినుంచి రాలేదు.

తాతయ్యగారింటి కొచ్చేక అమ్మమీద బెంగతో జ్వరమొచ్చింది.

నెలరోజులు మంచంలో వున్నాడు. అమ్మొచ్చిందా - అమ్మదగ్గరకెడతా ననీ కలవరించాడు.

తాత ఓదార్పు మాటలు, బామ్మ అనురాగం శాస్త్రిని మళ్ళీ మనిషిని చేశాయి.

తల్లి ప్రేమనే రెండు చేతులా రంగరించి పోస్తున్న తాతగారిదగ్గరే పెరిగి పెద్దవాడయ్యాడు.

హైస్కూలు చదువు పూర్తయింది.

శాస్త్రి ఇరవయ్యేళ్ళవాడయ్యాడు.

రెక్కలు విప్పుకున్న శాస్త్రి తహతహ తల్లి దగరే వుండిపోయేందుకు పురకలు వేసింది

తాతగారి ఆదరాభిమానాల నీడల్లోనే వేద తీర్చుకునేందుకు శాస్త్రి ఇష్టపడ్లేదు.

తాతయ్య వద్దని చెబుతున్నా వినకుండా నాన్నగారి వూరు చేరుకున్నాడు అమ్మకోసం.

చెల్లెలు పెద్దదైంది. తమ్ముడు పొడుగు సాగేడు.

అమ్మకూడా మారిపోయింది. తలవెంట్రుకల నెరుపులో.... పెరిగిన వయస్సులో ... పూర్తి మాతృ స్వరూపాన్ని తల్లిలో చూడగలిగేడు.

ఎన్నో ఏళ్ళ తర్వాత తను ఇంటికి వచ్చినా తల్లిలో ఏ విధమైన మార్పూగానీ.తనంటే అనురాగం కానీ కన్పించనందుకు నొచ్చుకున్నాడు

కొడుకుపట్ల భార్య చూపిస్తున్న దురభిమానానికి మానసికంగా ఆందోళన పడసాగేడు రాఘవరావు.

ఆ ఆందోళనలో భార్య యందు అనురాగం అసహ్యంగనూ, మమకారం కోపంగానూ రోజురోజుకీ రెచ్చిపోసాగేయి రాఘవరావులో

భర్త మనసులో వచ్చిన మార్పును తన పట్ల చూపుతున్న ప్రవర్తనను భయపడ సాగింది శాంతమ్మ. మిగతా పిల్లలూ తనూ భర్త ఆదరణకు దూరం కావలసి వస్తుందేమోఅనేఅనుమానం పీడించసాగింది.

ఇంట్లో ఈ విధమైన అశాంతికి కారణం శాస్త్రేనని రూఢి చేసుకుంది శాంతమ్మ.

ఈ పరిస్థితుల్లో...వాడు యెప్పటికీ ఇంట్లోనే వుండిపోతే ..? అమ్మో! తనీ నరక యాతన భరించలేను. మళ్ళీ గతం...అప్పటి పరిస్థితి కళ్లకు కట్టినట్టయింది శాంతమ్మకు.

గదిలో కూర్చుని చుట్ట కాలుస్తూన్న భర్తను సమీపించి పలకరించింది

విసుగ్గా, అయిష్టంగా ఇచ్చిన భర్త సమాధానం ఆమెలో రగులుతున్న కోపాన్ని మరింత రెచ్చగొట్టినట్టయింది.

"ఏమండీ! నా భయం అదేనండీ ... అదే..."భయంతో బాధతో అంది

"ఏం చేస్తాననా!!... పోతేనే హాయిగా వుండేట్టుంది..." ఇంకా ఏదో అనబోయాడు

'అవేం మాటలండీ? ఈ ఇంట్లో మళ్ళీ యేదో ఘోరం జరుగబోతోంది... అందుకే వాడిని ఇంట్లో నుంచి వెళ్ళిపొమ్మనండి. నాకు తెలుసు... వాడిక్కడుంటే..."

'ఛీ నోర్ముయ్! నువ్వు తల్లివి కాదు రాక్షసివి. కాదు ... అదృశాచివి... పొరపాటునైనా వాడీ మాటలు వింటే .."

తల్లిదండ్రులు తనను గురించి ఘర్షణ పడటం చెవులారా వింటున్న శాస్త్రి ప్రమాన్పడిపోయాడు. తను వాళ్ళ జీవితాలకు ఆనందాలకూ అడ్డుగా వుండకూడదనుకున్నాడు. తన రాకతో అమ్మలో కలిగిన అశాంతిని దూరం చేయాలనుకున్నాడు

అమ్మ నాన్నకు దూరం కాకూడదు. తమ్ముడూ చెల్లీ దిక్కులేని వాళ్ళు కాకూడదు తనేమైనా పర్వాలేదు.

అమ్మ సుఖం, మనశ్శాంతే తనక్కావాలి!

అమ్మ సుఖంకోసం, మనశ్శాంతికోసం ఇల్లు విడిచి వెళ్ళి మిలటరీలో చేరిన శాస్త్రి ..మళ్ళీ తల్లి దగ్గరకు వెడుతున్నాడు.

తల్లిని చూడబోతున్నాననే ఉత్సాహంవున్నా... మళ్ళీ తను ఇల్లుచేరుకున్న తర్వాత అమ్మ పరిస్థితి మరింత విషమంగా తయారవుతుందేమోననే భయం పీడించసాగింది.

* * *

శాస్త్రి మనస్సు మబ్బువిడని ఆకాశంలా ఉంది.

ఇంట్లో అడుగు పెట్టేసరికి తల్లి మంచంలో ఉంది.

"వచ్చేశానమ్మా! నీ కోసం ఉద్యోగం కూడా వదిలి వచ్చేశానమ్మా నిన్ను బ్రతికించుకుంటాను"

తల్లి కళ్ళువిప్పి చూచింది.

తల్లిచూపులో 'వచ్చేవా నా తండ్రీ...నాకోసం వచ్చావా' అనే తియ్యని భావనకు విరుద్ధంగా ఏదో-భయం, బాధ మూగగా అవుపించాయి.

అయినాసరే ..ఈసారి తల్లిని విడిచి దూరంగా వుండేందుకు ఇష్టపడలేకపోయాడు. ఇరవై నాలుగు గంటలూ సేవలుచేస్తూ తల్లిదగ్గరే ఉంటున్నాడు.

అప్పుడప్పుడు తల్లి తనవేపుచూసే చూపుల్లో ఇమిడివున్న మూగభావన అర్థంచేసుకోగలుగుతున్నప్పటికీ తను తల్లికి దూరంగా వుండలేక పోతున్నాడు.

తన మంచితనం, అభిమానం అమ్మకు అక్కర్లేకపోయినా-తనకు తల్లి కావాలి అనురాగం చిందిన ఆమె చల్లనిచూపు కావాలి! అమృతం చిందుతున్న ఆమె తియ్యని పలుకరింపుకావాలి!

రోజులు గడుస్తున్నాయి.

తల్లి అనారోగ్యం నుంచి కోలుకుంటుందనే ఆశ...ఆశగానే మిగులుతున్నందుకు మానసికంగా కృంగిపోతున్నాడు శాస్త్రి.

'ఎందుకురాబూ నీలోనువ్వట్లా కుమిలిపోతావ్? అది నీతో మాట్లాడకపోయినా నీ కళ్ళ యెదుట కనిపిస్తున్నదాయే...ఆ విధంగానైనా తృప్తి పడరాదూ?...' అనేవి తండ్రి సాదరంగా బుజ్జగించినప్పుడు నిర్లిప్తంగా నవ్వటంకంటే వేరే ఏమీ చేయలేకపోయాడు.

"నీతో మాట్లాడక పోవటం...దానికి మాత్రం ఆనందమనుకున్నావా '.... నువ్వు కళ్ళముందు కనిపిస్తున్నప్పుడు. పలుకరిస్తున్నప్పుడు అది నీ తల విసురలేక పోతున్నందుకు నీముఖంలోకిచూచి జవాబు చెప్పలేక పోతున్నందుకూ ... నీకంటే యెక్కువ వేదనకు గురవుతోంది. అది పడేబాధ .. అనుభవించే వ్యథ నా ఒక్కడికే తెలుసు .."అనేవి తండ్రి నోటినుండి సమర్థింపు విన్నప్పుడు .. అమ్మకొచ్చిన కష్టమేమిటో... అందుకుగల కారణమేమిటో తనతో యెందుకు చెప్పటంలేదాని గొణుక్కునేవాడు.

ఇంకా అమ్మకోసం తనేం చేయాలి ?—ఏం చేస్తే అమ్మ తృప్తిపడి తనతో మాట్లాడుతుంది? .. ఇవే ఆలోచన్లు శాస్త్రిని పిచ్చివాడిని చేస్తున్నాయి—

డాక్టరు ప్రతిరోజూ వచ్చి చూసి వెడుతున్నారు కాని—ఆరోగ్యాన్ని పుంజుకునేందుకు విరుద్ధంగా తల్లి మరింత అనారోగ్యంగా తయారవుతున్నదనే మాట డాక్టరు నోటినుండి వినేసరికి నిర్ఘాంత పోయాడు శాస్త్రి.

తల్లికి కొత్త నెత్తురు యెక్కించాలన్నాడు. డాక్టరు.

ఇంట్లో యెవ్వరి నెత్తురూ అమ్మకు సూటవలేదని తేలిపోయింది.

తనకంటే గాఢంగా తల్లిని ప్రేమించే నాన్న. తమ్ముడూ, చెల్లాయి నెత్తురే 'సూట' వలేదు...తన నెత్తురు మాత్రం ఏం పనికొస్తుందనిపించింది— అయినా డాక్టరు ముందు కెళ్ళి నిల్చుని చెయ్యి చాపాడు

'డాక్టర్! అమ్మను బ్రతికించండి నా నెత్తురు ఎక్కి చెయ్యండి ..'

'ఎంత మంచి మనసురా నీది ... నీ మాత్రం జ్ఞానం మీ అమ్మకు లేకపోయె ..." ప్రక్కనే వున్న తాతయ్య అస్పష్టంగా గొణిగేడు.

* * *

శాంతమ్మలో చలనం కన్పించింది

రాఘవరావు ముఖంలో ఆనందం విర్పొగ్యుడి చిరునవ్వులా వుంది

శాస్త్రి తృప్తిగా తల్లి ముఖంలోకి చూశాడు.

తల్లి పల్సు చూస్తున్న డాక్టరు ముఖం వికసించింది.

శాంతమ్మ కళ్ళు తెరిచి భర్తకేసి చూచింది

'ఏం భయంలేదు నువ్వు తప్పక బ్రతుకుతావ్. పెద్ద గండమే గడిచింది .." ధైర్యం చెప్పేడు భార్యకు రాఘవరావు.

'అవునండీ మీకేం ఫర్వాలేదు. మీ పెద్దబ్బాయి నెత్తురిచ్చి మీకు ప్రాణదానం చేశాడు..." డాక్టరు అన్నాడు.

శాంతమ్మ చూపుల్లో భావం మారింది - బాధతో మూలిగింది.

'అవును శాంతా నీకు యెవ్వరినెత్తురూ పనికిరాదన్నారు. పెద్దవాడే నిన్ను బ్రతికించుకున్నాడు...నిజంశాంతా ! ఇక వాడికోసమైనా నువ్వు బ్రతకాలి ..."ఆశగా అన్నాడు రాఘవరావు.

"వా...డి ..నె...త్తు...రా అ...యి...తే ...నే తొందరగా కళ్ళ...మూ...స్తా ..ను... మీరు...దుర ... దృష్ట ... వంతు ... లు..." హీనస్వరంతో గొణిగింది శాంతమ్మ.

తల్లి నోటినుండి ఆ మాటలు విన్న శాస్త్రి గుండెలమీద బలంగా సమ్మెటతో కొట్టినట్లయింది - గుండెను రంపంతో కోస్తున్నట్లనిపించింది.

భార్యమీద రాఘవరావుకు అసహ్యం ముంచుకొచ్చింది కోడలిపై జాలితో ఏవగింపూ కలిగింది.

'కసిపం...కొన్ని గంటలైనా...మీకుదగ్గరగా బ్రతక గలిగేదాన్ని...వాడి నెత్తురిచ్చి...కొద్ది .. నిముషాల్లోనే- దూరం చేస్తున్నారు..." మళ్ళీ మూలిగింది.

శాస్త్రి కొయ్యబారిపోయాడు.

'నాకళ్ళ ... ముందు నుండి ... వాడిని... వెళ్ళమనండి ... ఈ ...ఆఖరి క్షణాల్లోనైనా ... మీకు దగ్గరగా ..వుంటా...లనుంది "

బాధ శాస్త్రిని నిలువెల్లా కొరికేస్తోంది.

అడుగులో అడుగేసుకుంటూ నడిచి బైటకు వెళ్ళిపోయాడు.

భార్య మాటలు రాఘవరావును చీల్చివేసినయ్

"శాంతా! ఇవి నీ ఆఖరి క్షణాలు కావు నీ కొత్త జీవితానికి కాంతి కావాలి. -జీవితంలో ఇంత చూచినా నీలో మాతృత్వం స్రవించక పోవటానికి కారణం నాకు తెలుసు ..ఇన్నాళ్లూ వాడిని చిత్రహింస చేసింది చాలక...మళ్లీ యెందుకు వాడిని దూరం చేసుకుంటావ్..."


కళ్లు విప్పి భర్తకేసి చూచింది శాంతమ్మ.

"శాంతా నువ్వొట్టి పట్టుదల మనిషివి. మూర్ఖత్వంతో నీ మనసు రాయి చేసుకున్నావ్. మన పెళ్ళయి సంవత్సరం తిరక్క ముందే మనిద్దరి మధ్య కలతలు ఏర్పడ్డాయి. నిన్ను కాదని నేను యవ్వనపు పొంగులో మరో విధంగా సుఖపడాలనుకున్నాను. నిన్ను దూరం చేసుకున్నాను. నీ మనసు గాయపరచాను. అప్పటికే శాస్త్రి నీ కడుపున పడ్డాడు. అంచేత వాడొట్టి నష్టజాతకుడనీ ..వాడు కడుపున పడటం వల్లనే మనిద్దరి మధ్య కలతలు యేర్పడి నేను నీకు దూరమయ్యాననీ నీవు అపోహపడ్డావ్. అదే భావన నీలో మూఢనమ్మకంగా తయారై నీ మనసులో బలీయంగా పీఠం వేసుకుంది. మన సంసారం చక్కబడినా ... నువ్వు వాడిని ప్రేమించలేకపోయావ్. దగ్గరికి తీసుకోలేక పోయావ్. మాతృత్వపు ప్రేమను నీలో పెంచుకోవటానికి బదులుగా...వాడిని అసహ్యించుకుని దూరం చేసుకున్నావ్.- ఆ తర్వాత వాడు యెదుటబడినప్పుడల్లా తాత్కాలికంగా మనిద్దరిమధ్యా చెలరేగిన మన స్పర్థలకు కారణం వాడేనని మనసులో ముద్రవేసుకున్నావ్. వాడిని ద్వేషించావ్.- చివరికి నువ్వింత చేసినా ... నీకు ప్రాణాన్నిచ్చిన వాడు వాడే శాంతా !- ఎప్పుడో ఏదో జరిగిందానికి వాడి తప్పేముంది నువ్వే ఆలోచించు - నిజంగా వాడెంతో అదృష్టవంతుడు. అందుకే వాడే నిన్ను తిరిగి బ్రతికించుకో గలిగేడు. నిజం శాంతా ! ఇప్పటికైనా నీ మనసులో పీఠం వేసుకున్న అనుమానపు నీడలను దూరంచేసుకో ... నువ్వు బ్రతుకు !... వాడి మనసు తెలుసుకో! శాంతా!!" అంటున్న రాఘవరావు మాటల్లో రోదన ధ్వనించింది.

శాంతమ్మ బరువుగా నిట్టూర్చింది.

శాంతమ్మ ఆశాపూరిత నయనాలు గది నాలుగు మూలలూ శాస్త్రికోసం వెతికాయి.

★



(P.W.D. క్వార్టర్సు) గవర్నరుపేట, విజయవాడ-2.